# చివురుకొమ్మ చేవ

నిడదవోలు మాలతి

**ꓘ ꓘ ꓘ**

''మామీ..'' అంటూ పరుగెత్తుకు వచ్చింది కింజల్క స్కూలినించి.

''అబ్బ, ఎందుకలా మీద పడతావు?'' అంటూ విసుక్కుని, మళ్లీ చిన్నబోయిన పిల్ల మొహం చూసి, 'దా' అంటూ దగ్గిరికి తీసుకుంది శారద.

అవును మరి. దానికెలా తెలుస్తుంది తన మనోవేదన! తను మాత్రం ఎలా చెప్పగలదు?

''నీ కోసం వేశాను,'' అంటూ ఆరోజు స్కూల్లో వేసిన బొమ్మ చూపించింది.

''అబ్బో! చాలా బావుంది. ఫ్రిజ్‌మీద పెడతాను'' అంది శారద కింజూని హత్తుకుని.

కింజల్క మొహం విరిసిన దిరిసెన పూవులా విప్పారింది..

పిల్లలకేముంది? బావుందన్న ఒక్క మాట చాలు– ఏ వస్తు వాహనాలూ ఇవ్వ లేని ఆనందం,.. ఆ ఒక్క మాటతో సరి కావు.

''మీఅమ్మ టెలిగ్రాం ఇచ్చారు'' అంటూ మురారి లోపలికి వచ్చాడు.

''టెలిగ్రామా?''

ఇద్దరికీ వింతే, ఉరుములేని పిడుగులా.

''నెలాఖరికి వస్తున్నారట''

శారద మాటడలేదు.

''రావొద్దనిచెప్పు''

''ఆ?'' శారద అంది తెల్లబోయి.

''అదికాదు...''. అతని మాట పూర్తి కాలేదు.

''పదేళ్ళయింది. ఇల్లు రాదారి బంగళా. వారాలబ్బాయిల్లా మీ స్నేహితులు... మూడో విస్తరి వెయ్యని శనివారం లేదు. ఈనాటికి నా వంక మనిషి, అందునా మా అమ్మ వస్తానంటే రావొద్దని రాయనా?''

''మీ అమ్మ గారని కాదు. ఈ పరిస్థితుల్లో ఆవిడకి మాత్రం ఏం బావుంటుందని?''

''అమ్మ మ్మ వస్తోందిట'' అంది శారద పాపతో.

''నిజంగా! ఎప్పుడు?'' అంది ఉత్సాహంగా కింజు. అమ్మమ్మతో గడిపిన రోజులు తక్కువే అయినా, ఆవిడ వచ్చే పోయేవారితో పంపే కానుకలమూలంగా సుపరిచితమే.

''ఏం, నువ్విస్తావా, నేనివ్వనా?'' అన్నాడతను రొక్కిస్తూ.

''ఇవ్వను'' అంది శారద కింజల్క మొహంలోకి చూస్తూ. ఆ పిల్ల మొహం వన్నె తరిగింది.

ఓ క్షణం ఊరుకుని, ''కింజు వేసింది'' అంది బొమ్మ చూపిస్తూ.

''చాలా బావుంది. నువ్వు గొప్ప ఆర్టిస్టువవుతావు. మా వంశంలోనే ఉంది. మా పినతాతగారి బావమరిది గొప్ప కళాకారుడు'' అన్నాడు మురారి మురిసిపోతూ.

''నీకు రేపు వేస్తాను డాడీ'' అంది కింజల్క, తనకి పక్షపాతం లేదని తేటతెల్లం చేస్తూ.

''ఫ్రిజ్ మీద పెడతాను, అందరికీనూ'' అంది శారద.

''దా. బజారుకెళ్దాం''

ఇప్పుడెందుకంటే పుట్టినరోజు వస్తోంది కదా అన్నాడు మురారి.

''ఇప్పుడే కాదు, యూ సిల్లీ..'' అంది కింజల్క చిలిపిగా కళ్లు చిట్లించి.

''నాకూ తెలుసులే. మరి అప్పుడు నేను ఊళ్లో ఉండనేమోనని.''

శారద నిట్టూర్చి అక్కడ్నుంచి లేచిపోయింది.

★★★

అమ్మ అనుకున్న రోజుకి వచ్చింది. శారద తనే ఎయిర్‌పోర్టుకెళ్లి ఆవిణ్ణి తీసుకొచ్చింది. తలుపు తీస్తూనే, ''అమ్మమ్మా'' అంటూ కాళ్ల చుట్టేసింది కింజల్క.

అమ్మ మొహంలో దీప్తి. అలాటి క్షణంకోసం ఆవిడ ఎన్నివేల మైళ్ళ యినా పయనించగలదేమో!

''ఇలా చిక్కిపోయావేమిటే? ఏం పెడుతోంది మీ అమ్మ నీకు?'' అందావిడ ఆప్యాయంగా పిల్లదాని చెంపలు నిమురుతూ.

కింజల్క కిలకిలా నవ్వి, ''ఐ టోల్యూ'' అంది.

అమ్మ పిల్లదాని గడ్డం పుచ్చుకుని ''ఇదుగో. ఈ కీసర బాసర మాటలు నాకు తెలీవు. నాతో చక్కగా తెలుగులోనే మాటాడాలి, తెలిసిందా?'' అంది.

''ఓకే'' అందది భుజాలు కుదిపి.

శారద నవ్వుతూ, ''మనవాళ్లు అస్తమానం చిక్కిపోయావు అంటారని దానికి నవ్వులాట'' అని వివరణ ఇచ్చి, పద బాత్రూం చూపిస్తాను అంది లోపలికి నడుస్తూ.

అమ్మ స్నానం చేసి వచ్చేసరికి శారద కాఫీ సిద్ధం చేసింది.

అమ్మ కాఫీ తాగి, పెట్టె తెరిచి, చీరా, పంచెలచాపూ, పిల్ల కి పట్టుపరికిణీ, గాజులూ, గొలుసులూ, ఒక్కటొక్కటే తీస్తుంటే...

పిల్లదానిమోమున ఉత్తుంగ తరంగాలు....

శారద ఎదలో పోట్లు...

''ఇప్పుడివన్నీ ఎందుకమ్మా?'' అంది నొప్పి నణుచుకుంటూ.

మురారి చిటపటలాడుతూ లేచి వెళ్లిపోయాడు.

అమ్మ మాటాడ లేదు.

★★★

అమ్మ వచ్చిందగ్గిర్నించీ కింజల్క ఆటలూ, పాటలూ, తిండీ, తిప్పలూ ఆవిడే చూసుకుంటూంది.

ముందుగదిలో కూచుని శారద పేపరు చూస్తూంది. అమ్మ పిల్ల కి పాట నేర్పుతోంది.

చిట్టీ చిలకమ్మా! అమ్మ కొట్టిందా?
తోటకెళ్లావా? పండు తెచ్చావా?
గూట్లో పెట్టావా? గుటుక్కు మింగావా?

కింజల్కకి ఆ పాట బాగా నచ్చింది. తొరగానే నోటికొచ్చేసింది. కొంచెం తన కవిత్వం జోడించి ఇల్లంతా తిరుగుతూ

పాడుతోంది.

'చిట్టీ చిల్క మ్మా, కింజల్కమ్మా' అంటూ పాడుతుంటే అమ్మ దాన్ని సరిదిద్దబోయింది అది కాదే అంటూ..

''నాకిదే బావుంది. మామీ నో కొత్తుతూ...'' అంది కింజల్క బుంగమూతి పెట్టి.

''దానితో వాదించి నువ్వు గెలవలేవులే'' అంది శారద గోల పెడుతున్న ఫోను తీసుకుంటూ.

అటునించి రేవతిగారు శనివారం భోజనానికి రమ్మని పిలిచారు. ''అమ్మగారు వచ్చేరుట కదా. ప్రయాణం బాగానే అయిందా'' అంటూ కుశల ప్రశ్నలేసి ఆవిణ్ణి కూడా తప్పకుండా తీసుకు రమ్మ ని మరీ మరీ చెప్పారావిడ.

రాత్రి భోజనాలదగ్గిర ఆమాట చెప్తే ''నాకు పనుంది. మీరెళ్లండి'' అన్నాడు మురారి.

''రా డాడీ. చాలా బావుంతుంది. యూ లైక్ విస్నూ అంకుల్ తూ..'' అంది కింజల్క.

అతను అసలే అంతంత మాత్రం. అమ్మ వచ్చిం దగ్గిర్నుంచీ మరీ అర్ధావ్నం అయిపోయింది.

దోబూచులాడుతున్నట్టు తప్పించుకు తిరుగుతున్నాడు.

''నువ్వు చెప్పు'' అంది కింజు తల్లితో.

''రాకూడదూ. పిల్లలందరూ తల్లిదండ్రుల్తో వస్తారు''

''పనుందంటుంటే.. మరోసారి చూద్దాంలే''

శారద అమ్మతో 'నీబట్టలియ్యి, వాషర్లో పడేస్తాను' అంటూ లేచింది.

కింజల్క చిట్టీ చిల్క మ్మా, కింజల్కమ్మా.. అంటూ పాడుకోసాగింది.

అమ్మ కొట్టిందా అంది అమ్మ చరణం అందిస్తూ.

మామీ నో కొత్తూత్తూ అంది కింజు.

మీ అమ్మ కాదే, పాట అదీ అంది అమ్మ.

శారద నవ్వుతూ జేబులు తడుముతూంటే కింజు జేబులో సిగరెట్ల పెట్టె చేతికి తగిలింది.

తెల్లబోతూ తీసింది పైకి.

''నాది కాదు'' అందా పిల్ల అతి మామూలుగా.

మరి నీ జేబులోకి ఎలా వచ్చింది అంటే మాటాడదు.

''గట్టిగా ఆరేళ్లు లేవు. ఇప్పట్నుంచే ఇవేం పోకళ్లే?'' అంది అమ్మ అక్కజపడుతూ.

''నువ్వూరుకో అమ్మా! నేను మాటాడ్తాను''

''బాగానే ఉంది పెంపకం!''

''ఏమిటయింది?'' అంటూ మురారి ప్రవేశించేడు.

అవాల్సినంత రభసా అయింది. ఎంత అరిచినా కింజల్క నీకు సిగరెట్లెలా వచ్చేయి అంటే చెప్పలేదు. మురారి శారద మీద అరవసాగాడు.

పిల్ల ఆలనా పాలనా చూసుకోనక్కర్లేదా? పిల్లకి బుద్ధులు తల్లి కాకపోతే ఎవరు నేర్పుతారు? ఇవాళ సిగరెట్లూ, రేపు రౌడీ వేషాలు వేస్తూంటే నీకేం పట్టనట్టు చూస్తూ ఊరుకొంటావా?..

''సద్బుద్ధులొస్తే వంశ లక్షణం. తప్పులయితే తల్లి పెంపకమూను.'' అంది శారద ఎవరితో అంటోందో తెలీకుండా.

''స్టూపిట్ డాడీ. మామీ ఫాల్ట్ కాదులే'' అందాఖరికి ఆ పసిది అరుస్తూ.

''అయితే చెప్పు. నీకెలా వచ్చేయి అవి?'' అన్నాడు తండ్రి అంతక న్నా పై స్థాయిలో.

పై క్లాసులో కుర్రాడు దాచమని ఇచ్చాడుట, వాళ్లమ్మ చూస్తే కొడుతుందని.

''మీ అమ్మ అయితే ముద్దెట్టుకుంటుందేమిటి?'' అంది అమ్మ. ఆవిడకి ఇదంతా అయోమయంగా ఉంది.

''నువ్వూరుకో అమ్మా!'' అంది శారద నీరసపడిపోతూ.

ఈ వాదనలు ఇప్పట్లో అయేలా లేవని అమ్మ కింజల్కని రెక్క పుచ్చుకు పక్క గదిలోకి లాక్కు పోయింది.

ఆరాత్రి పిల్లని పక్క లో వేసుకుని పడుకుంది శారద. ఏం అడగాలో, ఎలా అడగాలో తెలీడం లేదు. ఈ దేశంలో 'టాక్, టాకం'టారు. తను అలా పెరగలేదు. ఈ టాకేమిటో, ఎలా సాగించాలో తనకి తెలీడం లేదు. మురారికి ఆస్ఫూర్తి కూడా ఉన్నట్టు లేదు!

''నామీద కోపంగా ఉందా?'' అంది ఆఖరికి శారద నెమ్మదిగా.

లేదంది ఆపిల్ల.

''పోనీ, ఇంకెవరితో నయినా మాటాడతావా?'' అంది గుండెలు చిక్క బట్టు కుని.

''మాటాడొచ్చా?'' కింజల్క ఇంచుమించు ఎగిరిపడ్డట్టు అడిగింది.

శారదకి కమ్చీతో ఛెళ్లున కొట్టినట్టయింది.

''ఏమీతో మాటాడతావా?'' అంది శారద ఆలోచిస్తూ. ఏమీకీ, కింజూకి వారి జీవితకాలం స్నేహం.

''ఉహుం'' తల అడ్డంగా ఊపింది.

''ఏం? నీకు ఏమీ చిన్నప్పట్నుంచీ ఫ్రెండు కదా?''

''వాళ్లమ్మ అస్తమానం నువ్వు వెళ్ళోతావంటుంది''

శారద గబుక్కున పిల్లదాన్ని గుండెల పొదువుకుంది. తొలిసారిగా ఉప్పెనగా దుఃఖం పొర్లుకొచ్చింది. సాటి పిల్లలు అల్లరి చేస్తారనుకుందే గాని తల్లులు కూడానా? తనెంతసేపూ తనబాధ గురించే ఆలోచిస్తోంది గాని పాపం పిల్లది ఎంత తపన పడుతోందో, దాని మనసెంత గాయపడిందో, దాని ఆలోచనలేమిటో... తనకే కాదు ఎవరికీ తోచినట్టు లేదు. అందరూ తనకి సలహాలు చెప్పేవారే కాని అదెలా ఉంది అని అడిగినవాళ్లు లేరు! అడుగుతారు ఎలా ఉందని. కాని నిజంగా ఎవరికీ తెలీదు ఆ పిల్ల ఆలోచనలేమిటో!

''సారీ మామీ'' అంది కింజు.

''ఎందుకు సారీ,'' అని మరో అరగంట కబుర్లు చెప్పి పడుకోమని పంపేసింది.

మర్నాడు శారద చీకటితోనే లేచి, కాఫీ పెడుతుంటే అమ్మ వచ్చింది ''అది రాత్రి నీదగ్గిరయినా సరిగ్గా పడుకుందా?'' అంటూ.

''ఏమిటీ, ఎవరిమాట?''

అర్ధరాత్రి లేచి అమ్మదగ్గిర పడుకుంటానని లేచి వచ్చేసిందిట అమ్మమ్మ పక్కలోనించి. కాని అమ్మ దగ్గిరికి పోలేదు!

ఒక్క ఉదుటున గదులన్నీ కలయతిరిగారు. మురారి కూడా గాభరాపడిపోతూ, ఏమయిందే మయిందంటూ లేచాడు. ముగ్గురూ నాలుగ్గదులూ కలయ తిరిగారు. మంచాల కిందా, క్లాజెట్లలోనూ, కాదు కాదనుకుంటూనే ఇరుగిళ్ల పొరిగిళ్ల కూడా వాకబు చేశారు. పోలీసులకి రిపోర్టిస్తే ఏమవుతుందన్న మీమాంసలో ఉండగానే ఫోనొచ్చింది.

జానెట్ అవతలి పక్క. ''అమ్మ గారికెలా ఉంది? ఇవాళ కూడా కింజుని నాదగ్గిరే ఉంచుకోనా?'' అని అడగడానికి పిలిచిందావిడ.

జానెట్‌కీ వీళ్లకీ ప్రాణ స్నేహం చాలా ఏళ్లయి. కాలిబాటన వెళ్తే మూడు నిముషాలు కాని రాజమార్గాన కారులో వెళ్తే ఆరు

నిముషాలు పడుతుంది అక్కడికి చేరడానికి.

పిల్ల క్షేమంగానే ఉందని ఇటు వీరికి చెప్పి, ''నేనే వస్తున్నాన''ని అటు జానెట్‌కి చెప్పి గబగబ బయల్దేరింది శారద పిల్లని తీసుకురావడానికి.

అర్ధ రాత్రి అమ్మ దగ్గర పడుకుంటానన్న కింజల్క లేచి, చేతికందిన చొక్కా వేసుకుని, తలుపు తీసుకుని తిన్నగా జానెట్ ఇంటికెళ్లి వాళ్ల తలుపు తట్టిందిట. అమ్మమ్మని హఠాత్తుగా హాస్పిటల్కి తీసుకెళ్తూ తననిక్కడ డ్రాప్చేసేశారని చెప్పిందిట.

ఇంటికి రాగానే మురారి కేకలేశాడు. తండ్రికి రావాల్సినంత కోపం వచ్చిందతనికి. ఊరుకుంటున్న కొద్దీ మితి మీరి పోతోందన్నాడు. అర్ధరాత్రి ఇల్లు వదలి పోవడానికెన్ని గుండెలన్నాడు.

సిగరెట్లూ.. అబద్ధాలూ.. ఇల్లు వదిలి పారిపోడాలూ... తల్లి ఆమాత్రం చూసుకోనక్కర్లేదా అన్నాడు...

''మీరిద్దరూ మీ తిప్పలేవో మీరు పడండి. నేను పిల్ల ని ఇండియా తీసుకుపోతానం''ది అమ్మ.

'నేనెక్కడికీ వెల్లను'' అంది కింజల్క.

''అసలెందుకు అలా పారిపోయావు? అది ముందు చెప్పు'' అన్నాడు మురారి.

''నేనేం పారిపోలేదు. జానెట్ దగ్గిరికి వెళ్లాను.''

మురారి ఒక క్షణం మాటాడలేదు గుక్క తిప్పుకోడానికన్నట్టు.

''చెప్పకుండా ఎందుకు వెళ్లావు?''

''నాఇష్టం.''

''నీ యిష్టం కాదు. ఈ ఇంట్లో నేనూ అమ్మా చెప్పినట్టు వినాలి, తెలిసిందా?''

''ఎందుకు వినాలి?''

''ఎందుకంటే నీ డాడీని కనక. తెలిసిందా?'' అని, శారదతో '' రేపట్నుంచి ఆస్కూలికి పంపకు. ప్రైవేటు స్కూలికి పంపుదాం. దారికొస్తుంది.''

''నేనేం అడిగానా నాకు ఈ మామీ, డాడీ కావాలని? ఐ హేట్యూ.''

శారద చటుక్కున పిల్లని ఎత్తుకుని పడగ్గదిలోకి తీసుకెళ్లిపోయింది.

అమ్మ లేనిపని కల్పించుకుని వంటగదిలోకి వెళ్లిపోయింది. మురారి తన ఆఫీసులోకి నిష్క్రమించేడు...

శారద ఆ రోజంతా ఆలోచిస్తూనే ఉంది. ''ఇజొౌజీఛ్చిట' ఈ దేశంలో గొప్ప ఫిలాసఫీ... పెళ్లీ, విడాకులూ కూడా తమ అభీష్టానుసారమే పెద్దవారి విషయంలో... ఎవరేం చేసినా తమ అభీష్టానుసారమే. పిల్లలు మాత్రం పెద్దలో కోర్టువారో నిర్ణయించగా ఎక్కడో పడతారు, ఫుట్బాల్ తన్నినట్టే.

బాగానే అడిగింది అది. ఎప్పుడు ఏ బిడ్డ కావాలో నిర్ణయించుకుని కంటున్న ఈరోజుల్లో ఆ బిడ్డ అభీష్టాలనెవరు అడిగేరు? నిజంగా ఆ పిల్లల ఇజౌజీఛ్చిటకే వదిలేస్తే, ఎంతమంది ఈకుళ్లులోకి రావడానికి ఇష్టపడతారో? –ఈ హింస, అక్రమాలు, స్వార్థం, ఎవరిక్కావాలి?

★★★

శనివారం రేవతిగారింటికి వెళ్లబోయేముందు కింజల్కా, శారదా కూడా మరోసారి అడిగారు కాని మురారి పని నెపంమీద ఇంట్లోనే ఉండిపోయాడు.

శారద అమ్మనీ కింజూనీ తీసుకుని వెళ్లింది.

దాదాపు 30 మంది ఉంటారు. పేరుకి తెలుగువాళ్లే అయినా, తెలుగూ, హిందీ, తమిళం, ఇంగ్లీషూ నానా బాసల మిశ్రమంతో పంచపళ్ల కషాయంలా, ఉగాదిపచ్చడికి వాచ్యార్థకంలా ఉంది అక్కడి వాతావరణం. అమ్మకి కొంతలో కొంత ఇంగ్లీషు అర్థం అవుతుంది కాని ఈ వాగ్ధోరణి మాత్రం మహా గందరగోళంగా ఉంది.

రేవతిగారి మామగారు క్రిష్ణయ్య గారు ఇక్కడే ఉంటున్నారు. ఆయన భార్య పోయిన తరవాత కొడుకు విష్ణు రారమ్మని తీసుకొచ్చేశాడు.

''ఎలా ఉంటున్నారండీ ఈ అడవిలో? వచ్చి వారం రోజులయింది. ఆకసాన తలకిందుల వేలాడే చాతకపక్షిలా కడగట్టుకుపోతూంది ప్రాణం. మనవాళ్లు ఇక్కడ ఏం చూస్తున్నారో నాకర్థం కావడం లేదు.'' అంది అమ్మ.

క్రిష్ణయ్య గారు చిరునవ్వుతో, ''ఆవరణ తల్లీ. ఏదయినా మనం మలుచుకోవడంలో ఉంది. హృదంతరాల కానగల వారిని ఈ బాహ్యాధరువులు అంతగా బాధించవు.''

''అవున్లెండి,'' అంది అమ్మ. ఆయన మళ్లీ 'ఇటు రండమ్మా ఒకసారి' అని నాలుగో బెడ్రూంవేపు నడిచారు. శారదా, అమ్మా ఆయన్ని అనుసరించారు.

ఆ చిన్నగది ముగ్గులతో, పసుపు, కుంకుమలతో, పచ్చని తోరణాలతో కళకళాలాడుతూంది. గదంతా కాయితప్పూలూ, ప్లాస్టిక్ అలంకరణలే అయినా ఎంచేతో ఎబ్బెట్టుగా అనిపించలేదు. తూర్పు దిక్కున గోడవారగా ప్రత్యేకంగా చేయించిన దారుమండపంలో అమర్చిన శ్యామలాదేవి విగ్రహం పీతాంబరంతో, నానా విధాల ఆభరణాలతోనూ కన్నుల పండువగా ఉంది...

క్రిష్ణయ్యగారు మౌనంగా ఊదొత్తి వెలిగించి ఒక్క క్షణం కళ్లు మూసుకున్నారు.

మాణిక్య వీణాముపలాలయంతీం మదాలసాం మంజుల వాగ్విలాసాం...

తన్మయత్వంతో, మధురాతిమధురంగా గళమెత్తి పాడ సాగారు.

మాతా మరకతశ్యామా మాతంగీ మదశాలినీ....

శారద తనువు పులకరించింది. అమ్మ కనులు చెమ్మ గిల్లేయి.

సాగరారబ్ధ సంగీత సంభ్రమాలోల..

ఎప్పుడొచ్చిందో కింజల్క శారద పక్కల హత్తుకు కూచుని తదేకంగా చూస్తోంది.

పక్క గదిలో రణగొణ ధ్వనులు కూడా మందరస్థాయికి దిగాయి.

క్రిష్ణయ్యగారు దండకం పూర్తి చేసి మరొక్క క్షణం ధ్యానించుకుని, ఎండు ద్రాక్ష పళ్లు ప్రసాదం పంచిపెట్టారు. కింజల్క రెండు చేతులా దోసిలి పట్టి ప్రసాదం పుచ్చుకుని తల్లివేపు చూసింది. శారద చిన్నగా కనుసాంజ్ఞ చేసింది మెచ్చుకోలుగా.

కింజల్క ప్రసాదం కళ్లకద్దుకుని నోట్లో వేసుకుంది.

క్రిష్ణయ్య గారు ఆపిల్ల చెంపమీద చిన్న చిటిక వేసి ''ఆ దేవి కూడా నీలాగే మహా సౌందర్యవతి'' అన్నారు.

''నాకు తెలుసు'' అంది కింజల్క చిలిపికనులతో.

శారద నవ్వి, ''మాకు వినయంపాలు కొరతలెండి'' అంది.

క్రిష్ణయ్యగారు నవ్వలేదు. ఆయన గంభీరంగా తల పంకిస్తూ, ''ఉండాలమ్మా ఆత్మ విశ్వాసం. అదే మనుగడకి మూలాధారం'' అన్నారు.

మరో అరగంట ఆ కబురూ ఈ కబురూ చెప్పుకుని బయల్దేరుతుంటే, రాఘవ ''నేను కూడా మీతో రావచ్చాండీ'' అని

అడిగాడు. అతని గది తాము వెళ్లే దారిలోనే. సరే రమ్మని అతన్ని కూడా కారులో ఎక్కించుకుని, స్టార్టు చేసింది.

రాఘవ వెనకసీట్లో కింజుపక్కన కూచున్నాడు.

''ఏమిటో మనం, మనవాళ్లూను. ఇక్కడ వీళ్లు స్వర్గానికి నిచ్చెనలేస్తుంటే మనం ఇంకా రాళ్లకీ రప్పలకీ, చెట్ల కీ పుట్టలకీ పూజలు చేస్తున్నాం. నీటిలో మునిగిపోతూ గరిక పోచలు పట్టుకున్నట్టు. వీళ్లు మేధా సంపత్తితో టెక్నాలజీ డెవలప్ చేస్తుంటే మనం మంత్రాలకి చింతకాయలు రాల్తాయని భజన ల్చేస్తున్నాం. ఆయనే చూడండి. మహా మేధావిలా ఉన్నారు. లాజికల్‌గా ఎందుకు ఆలోచించరు?''

''పోన్లేవోయ్. ఎవరి ఆనందం వారిది'' అంది అమ్మ.

''అది కాదండీ. మనం సైంటిఫిగ్గా ఆలోచించడం ఎప్పుడు నేర్చుకుంటాం? మనవాళ్ళకి తెలివితేటలు లేవనడం లేదు నేను... క్రిష్ణయ్య గారికి అద్భుతమయిన కంఠం ఉంది. ఒప్పుకుంటాను. గానకచేరీలు చేసుకోమనండి. దేవి సాక్షాత్కరించడం ఏమిటి?... ది మానీజ్ డెలూడెడ్''.

''నో హీజ్ నాట్''

రాఘవ ఉలికిపడి కింజల్క వేపు చూశాడు.

శారద అద్దంలో ఓ క్షణం వారిద్దరి మొహాలూ చూసి అమ్మవేపు చూసింది. ఆవిడ వదనం నిశ్చలంగా ఉంది.

''నేను కూడా చూశాను, చాలా బావుంది,'' అంది కింజల్క మళ్లీ.

రాఘవ ఏమనుకున్నాడో మరి మాటాడ లేదు. అతన్ని అతనింటి దగ్గర దింపేసి ఇంటికొచ్చేసరికి తొమ్మిదిన్నర అయింది. హాల్లో మురారి స్నేహితుల్తో పేకాడుతున్నాడు.

''డాడీ, ఏనుందన్నావు?'' అంది కింజల్క.

''ఇంతసేపూ పని చేసుకుంటూనే ఉన్నాను. ఇప్పుడే వచ్చారు వీళ్లు. మీరు తొరగా వచ్చేశారేం?''

''అమ్మ నిద్రకి ఆచుకోలేదని వచ్చేశాం'' అని చెప్పి శారద లోపలికి దారి తీసింది గబ గబా. తన చిరాకు అమ్మముందు ఎందుకు చూపలేక.

బట్టలు మార్చుకుని, మంచినీళ్ల కోసం వంటింటిలోకి వెళ్లబోతూంటే అమ్మ మాటలు వినిపించి గుమ్మం దగ్గిర ఆగిపోయింది.

''నాతో ఇండియా వచ్చేస్తావా? అక్కడ తాతగారూ, మామయ్యలూ, రాంబాబూ, చిన్నక్కా అందరూ ఉన్నారు. చక్కగా బోలెడు పాటలూ, కథలూ నేర్చుకుందువుగాని..''

''నేను రాను అమ్మమ్మా. పరవాలేదులే.. మామీ, డాడీ నీడ్ మీ. ఆ లిటిల్ గల్ టేక్కేర్ చేస్తుందిలే.''

శారదకి గుండె గొంతుకలో కొట్లాడింది. పరిపూర్ణ యౌవనవతి స్తుతి శ్యామలా దండకం. కింజల్కకి లిటిల్ గల్‌గా స్ఫురించడం వింతగా అనిపించలేదు.

''మామీ, డాడీ నీడ్ మీ'' అన్న మాట మాత్రం రాత్రంతా తలుచుకుంటూనే ఉంది శారద.

★★★

(February 2002)